సీఎం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన టీడీపీ నేత జగన్



సీఎం రేవంత్‌రెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న గండి జగన్‌యాదవ్

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గడ్డిఅన్నారం టీడీపీ నేత గండి జగన్‌యాదవ్ గురువారం తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. సీఎం రేవంత్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై తాను కాంగ్రెస్‌లో చేరినట్లు జగన్‌యాదవ్ తెలిపారు. మల్కాజిగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సునీతామహేందర్ రెడ్డి గెలుపు కోసం తన వంతు కృషి చేస్తానని ఆయన వెల్లడించారు.

ఎంఐఎంకు ఓటు వేసి ఒవైసీని గెలిపించండి

● మాజీ హోంమంత్రి మహమూద్‌అలీకి ఎమ్మెల్యే బలాల విజ్ఞప్తి



మహమూద్‌అలీకి ఎంఐఎం కరపత్రం అందజేసి ఓటు వేయాలని విజ్ఞప్తి చేస్తున్న ఎమ్మెల్యే బలాల

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఎంఐఎం ఎంపీ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీకి మద్దతుగా ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అహ్మద్ బలాల గురువారం ఆజంపుర డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఆజంపురలోని మాజీ హోంమంత్రి మహమూద్‌అలీ నివాసానికి వెళ్లి ఆయనకు ఎమ్మెల్యే బలాల తన కార్యకర్తలతో కలిసి కరపత్రం అందజేశారు. ఈసారి ఎన్నికల్లో మహమూద్‌అలీతోపాటు ఆయన కుమారుడైన మలకపేట బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి మహ్మద్ ఆజంఅలీ వారి కుటుంబీకులందరు ఎంఐఎంకు ఓటు వేసి హైదరాబాద్ ఎంపీగా అసదుద్దీన్ ఒవైసీని గెలిపించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఎంఐఎం ఆజంపుర డివిజన్ అధ్యక్షుడు షేక్ మొహియుద్దీన్ అబ్రార్, నాయకులు సయ్యద్‌అలీం, అనాస్‌ఖాద్రీ, మోయిన్ పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి: కార్పొరేటర్



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్

చంపాపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్‌లోని క్రాంతినగర్‌కాలనీ, పద్మానగర్‌కాలనీలో గురువారం కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. ఈసందర్భం గా ఆయన మాట్లాడుతూ క్రాంతినగర్‌కాలనీలో ఎత్తుపల్లాలు చూడకుండా గతంలో డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టినట్లు, దీంతో తరచూ డ్రైనేజీ సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. జలమండలి అధికారులతో చర్చించి 60మీటర్ల పొడవున నూతన డ్రైనేజీ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయించినట్లు ఆయన తెలిపారు. డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను రెండు రోజుల్లో మొదలుపెట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు ఆనంద్, కాలనీ ప్రతినిధులు నరేందర్‌రెడ్డి, సత్తిరెడ్డి, సత్యనారాయణగౌడ్, నర్సింగ్‌రావు, పద్మానగర్‌కాలనీ అధ్యక్షుడు ముత్యాల వీరారెడ్డి, బీజేపీ నాయకులు సద్ది సందీప్‌రెడ్డి, సుంకరి రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

బ్రెయిన్‌డెడ్ వ్యక్తి నుంచి అవయవాల సేకరణ



యాదగిరి(ఫైల్)

వనస్థలిపురం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలై బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి అవయవదానం చేశారు. ఎల్బీనగర్ కామినేని ఆస్పత్రి వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా యాచారం మండలం గడ్డమల్లయ్యగూడెంకు చెందిన ఎర్ర యాదగిరి వ్యవసాయం పనులు చేసుకుంటు కుటుంబ సభ్యులతో కలిసి జీవిస్తున్నాడు. కాగ ఈ నెల 19న యాదగిరి బైక్‌పై వెళ్తుండగా గునగల్ వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. వెంటనే అతని కుటుంబ సభ్యులు ఎల్బీనగర్‌లోని కామినేని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అందులో భాగంగా ఈనెల 24న యాదగిరి బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు తెలిపారు. ఈమేరకు యాదగిరి కుటంబ సభ్యుల అంగీకారంతో వైద్యులు లివర్, కిడ్నీలు, గుండె, కార్నియాలు సేకరించారు.



నాటక పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

నాటకరంగాన్ని ప్రోత్సహించడం అభినందనీయం

● ప్రారంభమైన పరుచూరి రఘుబాబు స్మారక నాటక పోటీలు

రవీంద్రభారతి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాలుగా నాటక పోటీలు నిర్వహిస్తూ నటీనటులను ప్రోత్సహించడంతోపాటు రంగస్థల వృద్ధికి పరుచూరి బ్రదర్స్ కృషి చేయడం అభినందనీయమని వక్తలు కొనియాడారు. గురువారం రవీంద్రభారతిలో పరుచూరి రఘుబాబు స్మారక 34వ జాతీయ స్థాయి నాటిక పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి అతిథులుగా ఆచార్య డి.ఎస్.ఎన్.మూర్తి, పరుచూరి గోపాలకృష్ణ, పరుచూరి వెంకటేశ్వరరావు, గుమ్మడి గోపాలకృష్ణ, దైవజ్ఞశర్మ, నటి శివపార్వతి తదితరులు హాజరయ్యారు. నాటక పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డి.ఎస్.ఎన్.మూర్తి మాట్లాడుతూ 34 సంవత్సరాలుగా పరుచూరి రఘుబాబు పరిషత్తులో దాదాపు 600 నాటకాలను ప్రదర్శించారని గుర్తు చేశారు. పరుచూరి రఘుబాబు పేరిట నాటక పోటీలను నిర్వహించి నాటక రంగాన్ని ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు. యువ నటీనటులు, దర్శకులు ఇలాంటి వేదికలను ఒక అవకాశంగా మార్చుకుని ముందుకు సాగాలని సూచించారు. వేలాది మంది నటీనటులకు వేదిక కల్పించిన ఘనత పరుచూరి సోదరులదని అన్నారు. రంగస్థల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పరుచూరి గోపాలకృష్ణ మాట్లాడుతూ తాను సిటీ కాలేజీలో చదువుతున్నప్పుడు దేశంలోనే పేరొందిన రవీంద్రభారతిలో నటించాలని ఉండేదని గుర్తు చేసుకున్నారు. సభానంతరం మొదటి రోజు నాటకాలను ప్రదర్శించారు. రాత నాటికను ప్రదర్శించారు. పోలుదాసు శ్రీనివాసరావు రచన దర్శకత్వం వహించారు. దీంతోపాటు జేబు చెప్పిన ఊసులు నాటక, రైతేరాజు, బూడిద నాటకాలను ప్రదర్శించారు. అన్ని నాటకాలు ఒకటితో ఒకటి పోటీ పడుతూ సాగాయి. చక్కటి నటనతో కళాకారులు ఆకట్టుకున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

వనస్థలిపురం : కాలనీల్లో ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వైదేహినగర్ నార్త్‌కాలనీ అధ్యక్షుడు పోగుల రాంబాబు అన్నారు. వైదేహినగర్ సాయిబాబ ఆలయం వద్ద తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ రంగారెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీల సహకారంతో వైదేహినగర్ నార్త్ ఓనర్స్ అసోసియేషన్, సాయిస్థలి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచితంగా బీపీ, షుగర్, గుండె తదితర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వైద్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఉచిత కంటి ఆపరేషన్లు

అబ్దుల్లాపూర్‌మెట్ : సురక్ష సేవా సంఘం ఆధ్వర్యంలో ధనలక్ష్మి ఆప్టికల్స్ సహకారంతో కంటి చూపు తగ్గిన 25 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు చేయించారు. ఆపరేషన్లు చేయించుకున్న వారిలో అబ్దుల్లాపూర్‌మెట్, మాల్ మల్లేపల్లి, హయత్‌నగర్‌కు చెందిన వృద్ధులు ఉన్నారు. ఈ సందర్భంగా సురక్ష సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిక్కిర గోపిశంకర్‌యాదవ్ మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 152 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించినట్లు తెలిపారు. ఆపరేషన్లతో పాటు ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.

నాగార్జునసాగర్ రహదారి గుర్రంగూడ నుంచి ఇంజాపూర్ కమాన్ వరకు స్ట్రీట్ లైట్లు లేక అంధకారం నెలకొన్నదని గ్రామస్థులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయడంతో ఆయన స్పందించి సంబంధిత అధికారులకు ఫోన్ చేశారు. స్ట్రీట్ లైట్ల నిర్వహణ అధికారులు గురువారం మరమ్మతులు పూర్తిచేసి లైట్లు వెలిగించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. - హయత్‌నగర్, ఆంధ్రజ్యోతి



బట్టేల్‌గుట్టకు 'మెట్ల మార్గం'..!

● త్వరలో అందుబాటులోకి ● ఈశాన్యం వైపు ఇనుప మెట్లు ఏర్పాటు



బట్టేల్‌గుట్టకు ఈశాన్యం వైపు ఏర్పాటు చేస్తున్న మెట్లు

సరూర్‌నగర్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ పాత భవనం వెనుక ఉన్న బట్టేల్‌గుట్ట పార్కులోకి వెళ్లడానికి తాజాగా మెట్ల మార్గం ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ పార్కులోకి వెళ్లడానికి దగ్గర దారి లేకపోవడం, బడంగ్‌పేట్ శ్మశానవాటిక గేటు పక్కనే పార్కు ప్రవేశద్వారం ఏర్పాటు చేయడం.. పైగా ఇది రోడ్డుకు దూరంగా ఉండడంతో సందర్శకులు అటు వైపు వెళ్లలేకపోతున్నారు. దాంతో సందర్శకులను ఆకట్టుకుంటుందనుకున్న పార్కు కాస్తా బోసిపోయి కనిపిస్తోంది. అక్కడ ఓ పార్కు ఉన్నదనే విషయం కూడా ఎవరికీ తెలియని పరిస్థితి ఏర్పడింది. దాంతో ప్రధాన రహదారి వైపు నుంచి మరో ప్రవేశద్వారం ఏర్పాటు చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్ణయించారు.

పాత భవనం పక్క నుంచి మెట్ల మార్గం

బట్టేల్‌గుట్ట ఎదురుగా ఉన్న పాత మునిసిపల్ భవనం పక్క నుంచి, గుట్టకు ఈశాన్యం వైపు నుంచి మెట్ల మార్గం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు పనులు కూడా ప్రారంభించారు. సందర్శకులు సులువుగా గుట్టపైకి వెళ్లేందుకు వీలుగా రెండు, మూడు మలుపులతో, ఏటవాలుగా ఈ మార్గాన్ని నిర్మిస్తున్నారు. ఫ్యాబ్రికేటెడ్(ఇనుప)మెట్లు నిర్మించి ఇరువైపులా రెయిలింగ్ ఏర్పాటు చేయనున్నారు. మెట్ల మార్గం మొదలయ్యే చోట అందమైన ఆకృతిలో ప్రవేశద్వారం ఏర్పాటు చేసి, దానికి గేటు బిగించనున్నారు. కేవలం ఉదయం, సాయంత్రం వేళ నిర్ణీత సమయాల్లో మాత్రమే తాళం తీసి సందర్శకులను అనుమతించనున్నారు. మరో పక్షం, నెల రోజుల్లో ఈ మెట్ల మార్గం అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు, పాలకులు యోచిస్తున్నారు. మెట్ల మార్గం పూర్తి నాణ్యతతో, సందర్శకులను ఆకట్టుకునే విధంగా నిర్మించాలని మేయర్ పారిజాతానర్సింహారెడ్డి అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఇందుకోసం దాదాపు రూ.పది లక్షలు వ్యయం చేయనున్నట్టు ఆమె పేర్కొన్నారు. మెట్ల మార్గం అందుబాటులోకి వస్తే సందర్శకుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశమున్నదని అధికారులు భావిస్తున్నారు.



గుట్టపై ఏర్పాటు చేసిన బుద్ధుడి విగ్రహం

దేశ భద్రతకు మోదీ ప్రభుత్వం పటిష్ఠ చర్యలు



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కోర్టు న్యాయవాదులను కలిసిన ఈటల రాజేందర్



ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

కుషాయిగూడ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): బీజేపీని భారీ మెజార్టీతో గెలిపించాలని మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. గురువారం ఈటల కుషాయిగూడలో విస్తృతంగా పర్యటించారు. జమ్మిగడ్డ నుంచి ప్రారంభమైన ఆయన ప్రచార యాత్ర వి.ఎన్.రెడ్డి నగర్, కుషాయిగూడ మీదుగా కొనసాగింది. అనంతరం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కోర్టులో న్యాయవాదులను కలిసి మద్దతు కోరారు. బీజేపీ పార్టీ నాయకులు మర్రి మోహన్ రెడ్డితో పాటు వివిధ కాలనీల సంక్షేమ సంఘం నాయకులు ఆయన వెంట ప్రచారంలో పాల్గొన్నారు.

ఈటల గెలుపు... మల్కాజిగిరి మలుపు

మల్కాజిగిరి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి లోక్‌సభ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలుపుతో మల్కాజిగిరి మరింత అభివృద్ధికి నోచుకుంటుందని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ ఉరపల్లి శ్రవణ్ అన్నారు. గురువారం ఆయన శ్రీకృష్ణానగర్, విష్ణుపురి తదితర ప్రాంతాల్లో ఈటలకు మద్దతుగా కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సోమ శ్రీనివాస్, శరత్‌యాదవ్, మురళి, పవన్, రవి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): దేశ భద్రతకు మోదీ ప్రభుత్వం పటిష్ఠ చర్యలు తీసుకుంటుందని, మల్కాజిగిరి పరిధిలో అన్ని విధాల అభివృద్ధి కోసం బీజేపీని గెలిపించాలని మల్కాజిగిరి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. నాగోల్ చౌరస్తా నుంచి మోహన్‌నగర్ వరకు గురువారం రాత్రి రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ పటిష్ఠతకు, అంతర్గత భద్రతకు పీఎం మోదీ వ్యూహాత్మక నిర్ణయాలు కీలకమన్నారు. అంతటా ప్రశాంత వాతావరణం నెలకొనేలా భద్రత చర్యలు తీసుకుంటున్నారని గతంలో నగరంలో చోటు చేసుకున్న దిల్‌సుఖ్‌నగర్, గోకుల్ చాట్ బాంబు బ్లాస్ట్ ఘటనలను ఆయన ప్రస్తావించారు. కరోనా సమయంలో అందరి ఆరోగ్య సంరక్షణ కోసం సరైన సమయంలో వ్యాక్సిన్ పంపిణీ చేశారని గుర్తు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల హామీలను మరిచారంటూ.. కాలేజీ విద్యార్థినులకు స్కూటీలిస్తామని, రైతులకు రుణమాఫీ అన్నారని గుర్తు చేశారు. రైతులకు రూ.34 వేల కోట్ల రుణమాఫీ ఒకేసారి చేస్తే తాను రాజకీయాలు వదులుకుంటానని మాజీ ఆర్థికమంత్రి హరీ‌ష్‌రావు వ్యాఖ్యానించడాన్ని ఆయన ప్రస్తావించారు. మే 13న ప్రజలు ఇచ్చే తీర్పు సీఎం రేవంత్‌కు గుణపాఠం అవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్, ఎల్బీనగర్ అసెంబ్లీ కన్వీనర్ కొత్త రవీందర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి నీరుకొండ రవి తదితరులు పాల్గొన్నారు.



రోడ్ షోలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

మునిసిపల్ 'కొత్త' భవనంలో విరిగిన బెంచీలు..!



బడంగ్‌పేట్ కార్పొరేషన్ నూతన భవనంలో సందర్శకుల కోసం ఏర్పాటు చేసిన బెంచీలను చూసి పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. చెప్పుకోవడానికి కొత్త భవనమే అయినా.. అక్కడ మాత్రం పాతవి, విరిగిన బెంచీలు మాత్రమే దర్శనమిస్తున్నాయి. పాత కార్యాలయంలోనే వాటిని ఉపయోగించకుండా పక్కనబెట్టిన అధికారులు.. ఇప్పుడు మళ్లీ వాటినే తీసుకొచ్చి కొత్త భవనంలో పెట్టడం విమర్శలకు తావిస్తోంది. బెంచీల కాళ్లు విరిగిపోవడంతో సపోర్టుగా సిమెంట్ ఇటుకలను ఏర్పాటు చేయడం గమనార్హం! ఎవరైనా గమనించకుండా కూర్చుంటే దభేల్‌మని కిందపడి నడుములు విరగ్గొట్టుకోవడం ఖాయం!! అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి సదర బెంచీలను తొలగించి, వాటి స్థానంలో కొత్త బెంచీలు ఏర్పాటు చేయాలని సందర్శకులు కోరుతున్నారు.
- సరూర్‌నగర్, ఆంధ్రజ్యోతి



నామినేషన్ అందజేస్తున్న నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ

హైదరాబాద్ బీజేపీ డమ్మీ అభ్యర్థిగా సుభాష్‌చందర్జీ నామినేషన్

సైదాబాద్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ బీజేపీ ఎంపీ డమ్మీ అభ్యర్థిగా పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. నగరంలోనే బీజేపీ సీనియర్ నాయకులలో ఒకరైన సుభాష్ చందర్జీ హైదరాబాద్ పార్టీ టికెట్ కోసం తీవ్రంగా యత్నించారు. కానీ చివరగా అధిష్ఠానం మాధవీలతకు టికెట్ కేటాయించింది. కేవలం డమ్మీ నామినేషన్ మాత్రమేనని, స్క్రూటినీ అనంతరం విత్ డ్రా చేసుకుంటానని సుభాష్‌చందర్జీ తెలిపారు.

యువకుడికి రెండు రోజుల జైలుశిక్ష



ప్రేమ్‌సింగ్‌బట్టి

చంపాపేట, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పోలీసులతో దురుసుగా ప్రవర్తించిన ఓ యువకుడికి రెండు రోజుల జైలు శిక్ష పడింది. కంచన్‌బాగ్ ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని డీఎమ్ఆర్‌ఎల్ చౌరస్తా శ్రీ బంధన ప్రసన్నాంజనేయస్వామి ఆలయం ఎదుట ఈ నెల 13న సాయంత్రం డ్రింకన్ డ్రైవ్ పరీక్షల కోసం వాహనాలు నిలుపుతుండగా మీర్‌పేట బీఎస్ఆర్‌నగర్ కాలనీకి చెందిన ప్రేమ్‌సింగ్ బట్టి(24) పోలీసులతో దురుసుగా ప్రవర్తించినట్లు తెలిపారు. అతనిపై కేసు నమోదు చేయగా గురువారం నాంపల్లి కోర్టులో అతన్ని హాజరు పరచగా న్యాయమూర్తి అతనికి రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు తెలిపారు.



నగలను మహిళకు అప్పగిస్తున్న ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రెడ్డి

ఆటోలో మర్చిపోయిన నగలు తిరిగి అప్పగింత

చంపాపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళ ఆటోలో మర్చిపోయిన నగలను పోలీసులు తిరిగి స్వాధీనం చేసుకున్నారు. కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హఫీజ్‌బాబానగర్ కాలనీకి చెందిన జీబా సుల్తానా బుధవారం హఫీజ్‌బాబానగర్ నుంచి బండ్లగూడ వెళ్లేందుకు ఆటోలో బయలుదేరారు. ఆమె ఆటోలోనే నగలు, డబ్బుతో ఉన్న బ్యాగు మరిచిపోయింది. గురువారం ఆమె కంచన్‌బాగ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల ఆధారంగా నగల బ్యాగు ఉన్న ఆటోను గుర్తించారు. క్రైమ్ టీమ్ సహకారంతో బండ్లగూడలో ఆటో డ్రైవర్ నుంచి 90 గ్రాముల బంగారు నగలు, 20వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. నగలు, డబ్బు పోగొట్టుకున్న జీబా సుల్తానాకు వాటిని ఇన్‌స్పెక్టర్ తిరిగి అప్పగించారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

సైదాబాద్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పరీక్షలో ఫెయిల్ కావడంతో ఇంటర్ విద్యార్థిని కనిపించకుండా పోవడంతో కుటుంబసభ్యులు సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చింతల్‌బస్తీలో నివాసముండే వలీ కూతురు దీపికా(16) బుధవారం ప్రకటించిన ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఫలితాల్లో ఫెయిల్ అయింది. దీంతో విద్యార్థిని ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉంది. కుటుంబసభ్యులు బాలిక ఆచూకీ కోసం వెదికినా లభించకపోవడంతో సైదాబాద్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

ముగ్గురు పిల్లలతో తల్లి..

సైదాబాద్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పుట్టింటికి వెళ్తున్నానని భర్తకు చెప్పి ముగ్గురు పిల్లలతో వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైంది. దీంతో భర్త ఫిర్యాదు మేరకు గురువారం సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. శంకేశ్వర్ బజార్‌లో సెల్‌ఫోన్ మెకానిక్‌గా పనిచేసే ఇస్మాయిల్ భార్య మనీషా(28) ఈ నెల 22న కర్నూల్‌లోని పుట్టింటికి వెళ్తున్నానని ముగ్గురు పిల్లలతో కలిసి ఇంటి నుంచి వెళ్లింది. కానీ అక్కడికి చేరుకోలేదు. మూడు రోజులుగా ఆమె ఆచూకీ లేకపోవడంతో భర్త గురువారం సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

న్యాయమూర్తుల బదిలీ

రంగారెడ్డి జిల్లా కోర్టులు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కోర్టులకు చెందిన పలువురు న్యాయమూర్తులు ఇతర కోర్టులకు బదిలీ అయ్యారు. జిల్లా కోర్టు నుంచి జడ్జి నర్సిరెడ్డితో పాటు మరో నలుగురు న్యాయమూర్తులు బదిలీ అయిన వారిలో ఉన్నారు. వారికి రంగారెడ్డి జిల్లా కోర్టుల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.

కాంగ్రెస్ హస్తం.. పేదల నేస్తం

● చేవెళ్ల ఎంపీ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి
● రెండో సెట్ నామినేషన్ దాఖలు
● 'పాంచ్ న్యాయ్'తో అందరికీ ప్రయోజనం

రాజేంద్రనగర్/రంగారెడ్డి అర్బన్, , ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ హస్తం.. పేదల నేస్తమని చేవెళ్ల లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. చేవెళ్ల లోక్‌సభ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా గురువారం రాష్ట్ర మైనార్టీ గురుకుల విద్యాసంస్థల వైస్‌ఛైర్మన్ మహ్మద్ ఫయీమ్ ఖురేషీ, వికారాబాద్ డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఇతర నాయకులతో కలిసి రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయంలో చేవెళ్ల ఎన్నికల రిటర్నింగ్‌అధికారి, జిల్లా కలెక్టర్ శశాంకకు రెండో సెట్ నామినేషన్‌ను దాఖలు చేశారు. అనంతరం రంజిత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో ఇప్పటికే నాలుగు అమలు చేశామని, మిగతా రెండు గ్యారెంటీలను పార్లమెంట్ ఎన్నికల అనంతరం అమలు చేస్తామని అన్నారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ 'పాంచ్ న్యాయ్' పేరుతో మేనిఫెస్టోను తీసుకొచ్చారని తెలిపారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంటేనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని రంజిత్‌రెడ్డి అన్నారు. దేశాభివృద్ధికి, చేవెళ్ల నియోజక వర్గ అభివృద్ధికి ముస్లింలు, సిక్కులు, క్రైస్తవులు అన్నివర్గాల ప్రజలు మద్దతు ఇచ్చి కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ 14 ఎంపీ సీట్లు సాధించడం ఖాయమన్న ఆయన, ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ, కాంగ్రెస్ మధ్యనే పోటీ ఉంటుందని అన్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో నామిషన్ దాఖలు చేస్తున్న చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్



మియాపూర్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి

చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరేద్దాం

మియాపూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కొండాపూర్ ప్రేమ్‌నగర్, మాదాపూర్ డివిజన్ ఆదిత్యనగర్‌లో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌ల్లో నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో చేవెళ్ల అభివృద్ధికి అందరూ కాంగ్రెస్‌కు అండగా నిలవాలన్నారు. నాయకులు కార్యకర్తలు శక్తివంచన లేకుండా పార్టీ అభ్యర్థి గెలుపుకు పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంబీసీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ జెరిపెటి జైపాల్, పార్టీ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రంజిత్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలి

హైదర్‌నగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి గురువారం నామినేషన్ వేసిన సందర్భంగా ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ శివమ్మకాలనీ అసోసియేషన్ సభ్యులు గురువారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ను కలిశారు. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్ రెడ్డికి మద్దతు ఇవ్వాలని కార్పొరేటర్ అసోసియేషన్‌ను కోరారు.

మైనారిటీలకు అండగా నిలిచేది కాంగ్రెస్ ఒక్కటే

సరూర్‌నగర్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మైనారిటీ వర్గాల ప్రజలకు అండగా నిలిచేది కాంగ్రెస్ పార్టీ ఒక్కటేనని, ఆయా వర్గాల ఓటర్లు వచ్చే ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కే సంపూర్ణ సహకారం అందించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాత్రి బడంగ్‌పేట్ కార్పొరేషన్ బాలాపూర్ 15వ డివిజన్ పరిధిలోని ఆర్సిడ్‌కాలనీ, సీపీఎస్ఆర్ కాలనీ, మెట్రోసిటీ తదితర కాలనీల్లో ముస్లిం మైనారిటీ నేతలు, మహిళలతో కలిసి చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిజాముద్దీన్, అఫ్జల్, బాల్‌నింగని జంగయ్య, రియాసత్, బాబాభాయ్, మెహమ్మద్, రియజ్‌భాయ్ తదితరులు పాల్గొన్నారు.

రంజిత్‌రెడ్డిని ఎంపీగా గెలిపించాలి

ఎల్బీనగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): హస్తంగుర్తుకు ఓటు వేసి రంజిత్‌రెడ్డిని మరోసారి ఎంపీగా గెలిపించాలని కాంగ్రెస్ నాయకులు సరూర్‌నగర్ డివిజన్‌లోని అంబేడ్కర్‌నగర్, శంకర్‌నగర్, జైస్వాల్‌కాలనీలలో గురువారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. మాజీ కార్పొరేటర్ అనితాదయాకర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు శంకర్‌యాదవ్, బేర బాలకిషన్‌ల ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు, సంక్షేమ సంఘాల ప్రతినిధులతో కలిసి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అరవింద్‌కుమార్, నల్లంకి ధన్‌రాజ్‌గౌడ్, బండి మధుసూదన్, సుదర్శన్ ముదిరాజ్, ఇమ్రాన్, నయిబ్, అరుణ, నాగమణి, లోడి నరసింహ, నాగేష్, జంగారెడ్డి, మల్లేష్, రాఘవేంద్రగుప్త, కందుల రాము, భాగ్యమ్మ పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న మాజీ కార్పొరేటర్ అనితా దయాకర్‌రెడ్డి, బేర బాలకిషన్, శంకర్‌యాదవ్